

గేటును కూల్చివేస్తున్న దృశ్యం



ఈదులచెరువు ఎఫ్‌టీఎల్‌లో వెలసిన కంచెను తొలగిస్తున్న దృశ్యం

హైడ్రా ఆదేశాలతో కదలిన యంత్రాంగం

- ఈదులచెరువు ఎఫ్‌టీఎల్‌లో వెలసిన కంచె తొలగింపు
- చెరువు కబ్జాలకు పాల్పడితే క్రిమినల్ కేసులు: ఏఈ

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

అబ్దుల్లాపూర్‌మెట్ : చెరువుల ఎఫ్‌టీఎల్ పూడ్చివేతపై 'హైడ్రా అయితే మాకేంటి' అనే శీర్షికతో గురువారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన వార్త కథనానికి ఇరిగేషన్ అధికారులు స్పందించారు. ఈ మేరకు హైడ్రా ఉన్నత అధికారుల ఆదేశాలతో ఇరిగేషన్ అధికారులు పెద్దఅంబర్‌పేట్ సర్వే నంబర్ 292 ఈదుల చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలో పూడ్చివేసిన స్థలాన్ని పరిశీలించారు. ఎఫ్‌టీఎల్ స్థలంలో వెలసిన కంచెను జేసీబీ సహాయంతో అధికారులు తొలగించారు. చెరువు, కుంటల ఆక్రమణలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తీసుకుని క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని ఇరిగేషన్ ఏఈ తస్వీర్ రజ హెచ్చరించారు. కార్యక్రమంలో ఇరిగేషన్ వర్క్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.

మట్టి కుప్పల చదును..



పెద్దఅంబర్‌పేట్ నుంచి మునగనూర్ వెళ్లే రోడ్డు సమస్యపై మట్టి కుప్పలు ఇలా..వెళ్లేదెలా అనే శీర్షికతో గురువారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన వార్త కథనానికి మున్సిపల్ అధికారులు స్పందించారు. ఈ మేరకు సదరు రోడ్డు మధ్యలో పోసిన మట్టి కుప్పలను దోజర్‌తో చదును చేశారు. - అబ్దుల్లాపూర్‌మెట్, ఆంధ్రజ్యోతి



వివరాలు వెల్లడిస్తున్న వనస్థలిపురం ఏసీపీ కాశీరెడ్డి, పక్కన ఇన్‌స్పెక్టర్ అశోక్ రెడ్డి (సర్కిల్‌లో నిందితుడు శివాజీరెడ్డి)

టెకీ యువతిపై అత్యాచారం కేసులో రెండో నిందితుడికి రిమాండ్

వనస్థలిపురం, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): వనస్థలిపురం పోలీస్ స్టేషన్ పరిధిలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగినిపై జరిగిన సామూహిక అత్యాచారం కేసులో రెండో నిందితుడు మునగాల శివాజీరెడ్డి అలియాస్ చింటూరెడ్డిని బుధవారం అర్ధరాత్రి గుంటూరు జిల్లా చిలుకలూరిపేటలో పోలీసులు అరెస్ట్ చేసి వనస్థలిపురం పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అతని వద్ద ఉన్న సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకుని గురువారం రిమాండ్‌కు తరలించారు. ఈ సందర్భంగా వనస్థలిపురం ఏసీపీ కాశీరెడ్డి తన కార్యాలయంలో మాట్లాడుతూ జాబ్‌వచ్చిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగినికి చిన్ననాటి స్నేహితుడైన ఎడ్ల గౌతమ్‌రెడ్డి ట్రీట్ ఇవ్వమని కోరాడు. ట్రీట్ ఇస్తున్న సమయంలో సదరు ఉద్యోగినికి బలవంతంగా మద్యం తాగించి అపస్మారక స్థితిలోకి వెళ్లగానే గౌతమ్‌రెడ్డి అత్యాచారానికి పాల్పడ్డాడు. అనంతరం అతని స్నేహితుడు శివాజీరెడ్డిని రప్పించి యువతిపై అత్యాచారం చేయించాడు. తీవ్ర రక్తస్రావమైన యువతి స్పృహలోకి వచ్చిన సమయంలో హోటల్ గదిలో ఉన్న గౌతమ్‌రెడ్డి, శివాజీరెడ్డిలను చూసి కేకలు వేయడంతో హోటల్ సిబ్బంది పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో విషయం వెలుగులోకి వచ్చింది. ఈ కేసులో ప్రధాన నిందితుడు గౌతమ్‌రెడ్డిని మంగళవారమే అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించగా.. పరారీలో ఉన్న మరో నిందితుడు శివాజీరెడ్డిని బుధవారం రాత్రి అరెస్ట్ చేసినట్లు ఏసీపీ కాశీరెడ్డి తెలిపారు. పరారీలో ఉన్న నిందితుడిని త్వరితగతిన పట్టుకోవడంలో కీలకంగా వ్యవహరించిన మీర్‌పేట్ డీఐ గౌరీనాయుడుతో పాటు ఇతర సిబ్బందిని ఏసీపీ అభినందించారు.

ఆపరేషన్ ముస్కాన్‌లో 1175 మంది చిన్నారులను కాపాడిన అధికారులు

హైదరాబాద్ సిటీ: భిక్షాటన చేస్తున్న పిల్లలు, బాల కార్మికులను కాపాడేందుకు పోలీసులు చేపట్టిన ఆపరేషన్ ముస్కాన్ 10వ ఎడిషన్‌లో హైదరాబాద్, సైబరాబాద్ కమిషనరేట్ల పరిధిలో మొత్తం 1175మంది చిన్నారులను రక్షించారు. కార్మికశాఖ, రెవెన్యూ, చైల్డ్ ప్రొటెక్షన్ యూనిట్, చైల్డ్‌లైన్, పోలీసులు, ఎన్‌జీఓలు సంయుక్తంగా జూలై 1 నుంచి జూలై 31 వరకు ఆపరేషన్ ముస్కాన్ నిర్వహించారు. హైదరాబాద్ కమిషనరేట్ పరిధిలో 25 బృందాలు పలు ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించి 524 మంది పిల్లలను కాపాడారు. వీరిలో 481 మంది బాలురు, 43మంది బాలికలు ఉన్నారు. వీరిలో తెలంగాణకు చెందిన వారు 317 మంది కాగా.. మిగతా 207మంది ఇతర రాష్ట్రాలకు చెందిన వారని పోలీసులు తెలిపారు. పిల్లలను పనిలో పెట్టుకున్న వారిపై 20 కేసులు నమోదు చేశామని, మిగతా వారికి రూ. 11.21 లక్షలు జరిమానా విధించినట్లు అధికారులు తెలిపారు.

సైబరాబాద్ పరిధిలో 618 మంది..

ఆపరేషన్ ముస్కాన్‌లో సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలో 11 బృందాలుగా ఏర్పడ్డ అధికారులు 651 మంది చిన్నారులను కాపాడారు. వీరిలో 618 మంది బాలురు, 33 మంది బాలికలు ఉన్నారు. వీరిలో నలుగురు బాలురు, ఏడుగురు బాలికలు భిక్షాటన చేస్తుండగా అధికారులు గుర్తించారు. మిగతా 614 మంది బాలురు, 26 మంది బాలికలను వెట్టి చాకిరి నుంచి అధికారులు కాపాడారని సైబరాబాద్ ఉమెన్ సేఫ్టీ వింగ్ డీసీపీ కె.సృజన తెలిపారు.

నేటి సీఎం సభకు హాజరుకావాలి

హైదరాబాద్ సిటీ: ఇటీవల పదోన్నతులు పొందిన ఉపాధ్యాయులు ఎల్‌బీ స్టేడియంలో శుక్రవారం జరిగే సీఎం రేవంత్‌రెడ్డి సభకు హాజరుకావాలని పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మధుసూదన్‌రెడ్డి, తిరుపతిరెడ్డి కోరారు. గత తొమ్మిదేళ్లుగా పదోన్నతులు లేక, ఆరేళ్లుగా బదిలీలు జరగక ఇబ్బందులు పడుతున్న ఉపాధ్యాయుల సమస్యలను అధికారంలోకి వచ్చిన వెంటనే పరిష్కరించిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికే దక్కుతుందని తెలిపారు. కాగా, రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో 5500 ప్రైమరీ స్కూల్ హెచ్‌ఎం పోస్టులను మంజూరు చేసి బీఈడీ అర్హత కలిగిన ఉపాధ్యాయులకు ఇచ్చే విధంగా ఉత్తర్వులు ఇవ్వాలని సీఎంను కోరారు.



సరూర్‌నగర్‌లో ఎమ్మెల్యే సబితారెడ్డి దిష్టిబొమ్మను దహనం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు బేర బాలకిషన్, శంకర్‌యాదవ్, ధన్‌రాజ్‌గౌడ్ తదితరులు



బడంగ్‌పేట్‌లో సీఎం, డిప్యూటీ సీఎం దిష్టిబొమ్మలను దహనం చేస్తున్న బీఆర్‌ఎస్ శ్రేణులు



బడంగ్‌పేట్‌లో కేటీఆర్, సబిత దిష్టిబొమ్మలను దహనం చేస్తున్న కాంగ్రెస్ నేతలు



మీర్‌పేట్‌లో సీఎం, డిప్యూటీ సీఎం దిష్టిబొమ్మలను దహనం చేస్తున్న బీఆర్‌ఎస్ శ్రేణులు

కాంగ్రెస్, బీఆర్‌ఎస్ పోటాపోటీగా దిష్టిబొమ్మల దహనాలు

సరూర్‌నగర్, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): అసెంబ్లీలో అధికార, విపక్ష సభ్యుల మధ్య బుధవారం జరిగిన సంవాదం నేపథ్యంలో గురువారం బడంగ్‌పేట్ కార్పొరేషన్ పరిధిలో ఇరుపార్టీల నేతలు పోటాపోటీగా దిష్టిబొమ్మలు దహ నం చేసే కార్యక్రమాలు చేపట్టాయి. తమ పార్టీ మహిళా ఎమ్మెల్యేలను అవమానించేలా వ్యాఖ్యలు చేశారంటూ బీఆర్‌ఎస్ నేతలు సీఎం, డిప్యూటీ సీఎం దిష్టిబొమ్మలు దహనం చేయగా.. సీఎం రేవంత్‌రెడ్డిపై అసత్య ప్రచారాలు చేస్తూ ఆయనను అవహేళన చేసే విధంగా బీఆర్‌ఎస్ సభ్యులు వ్యవహరించారని ఆరోపిస్తూ కాంగ్రెస్ శ్రేణులు బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీమంత్రి సబితారెడ్డిల దిష్టిబొమ్మలను దహనం చేశారు. దాంతో బడంగ్‌పేట్‌లో కాసేపు ఉద్రిక్త పరిస్థితి కనిపించింది. ఇరు పార్టీలు ఎదురుపడితే ఏం జరుగుతుందో అనే టెన్షన్ నెలకొంది. అయితే ఒకరి తర్వాత ఒకరు తమ కార్యక్రమాలు నిర్వహించుకోవడంతో పోలీసులు సైతం ఊపిరి పీల్చుకున్నారు. ముందుగా బీఆర్‌ఎస్ బడంగ్‌పేట్ శాఖ అధ్యక్షుడు రామిడి రాంరెడ్డి ఆధ్వర్యంలో బడంగ్‌పేట్ చౌరస్తాలో సీఎం, డిప్యూటీ సీఎంల దిష్టిబొమ్మలను దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐదు సార్లు మంత్రిగా పని చేసిన సబితారెడ్డిని కించపరిచే విధంగా సీఎం మాట్లాడారని, మహిళల పట్ల గౌరవం లేని వ్యక్తి సీఎం సీట్లో కూర్చోవడం రాష్ట్రం చేసుకున్న దురదృష్టమని అన్నారు. కార్యక్రమంలో పార్టీ కార్పొరేటర్లు, నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

అనంతరం కాంగ్రెస్ బడంగ్‌పేట్ శాఖ ఆధ్వర్యంలో అదే చౌరస్తాలో కేటీఆర్, సబిత దిష్టిబొమ్మలను దహనం చేశారు. టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, బడంగ్‌పేట్ మేయర్ చిగిరింత పారిజాతానర్సింహారెడ్డి పాల్గొని మాట్లాడుతూ రాజకీయాల్లో 'మోసం' అనే పదానికి సబితారెడ్డి పర్యాయపదంగా మారారని ధ్వజమెత్తారు. పదవి కోసం ఆమె ఏ పార్టీలోకైనా వెళ్తారని దుయ్యబట్టారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మీర్‌పేట్‌లో..

మీర్‌పేట్ కార్పొరేషన్ పరిధిలోనూ ఇరు పార్టీలు దిష్టిబొమ్మల దహనం కార్యక్రమాలు నిర్వహించాయి. బీఆర్‌ఎస్ అధ్యక్షుడు అర్కల కామేశ్‌రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ దిండు భూపేశ్‌గౌడ్ ఆధ్వర్యంలో మీర్‌పేట్ చౌరస్తాలో రేవంత్, భట్టి దిష్టిబొమ్మలను దహనం చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మేయర్ దుర్గదీప్‌లాల్, డిప్యూటీ మేయర్ విక్రమ్‌రెడ్డి మాట్లాడుతూ సీఎం, డిప్యూటీ సీఎం ఇద్దరూ సబితారెడ్డికి బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఇక కాంగ్రెస్ నాయకుడు సురేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో బాలాపూర్ చౌరస్తాలో కేటీఆర్, సబిత దిష్టిబొమ్మలను దహనం చేశారు. బాలాపూర్ చౌరస్తాలో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న టఫ్‌ఐడీసీ చైర్మన్, రంగారెడ్డి డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ కష్టకాలంలో ఉన్నప్పుడు నమ్మక ద్రోహం చేసి బీఆర్‌ఎస్‌లో చేరిన చరిత్ర సబితారెడ్డిదని ఎద్దేవా చేశారు.



బీజేఆర్‌భవన్ వద్ద ఎమ్మెల్యే సబితారెడ్డి దిష్టిబొమ్మను దహనం చేస్తున్న కాంగ్రెస్ నాయకుడు ఉపేందర్‌రెడ్డి తదితరులు

ఆర్‌కేపురంలో..

ఎల్‌బీనగర్: ఆర్‌కేపురం డివిజన్ మహిళా కాంగ్రెస్ ఆధ్వర్యంలో కొత్తపేట చౌరస్తా సమీపంలోని బీజేఆర్‌భవన్ వద్ద బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, ఎమ్మెల్యే సబితారెడ్డిల దిష్టిబొమ్మలను దహనం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై అసత్య ఆరోపణలు చేస్తున్న సబితారెడ్డి తన వైఖరిని మార్చుకోవాలని కాంగ్రెస్ నాయకులు సూచించారు. కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు చిలుక ఉపేందర్‌రెడ్డి, ఆర్‌కేపురం కాంగ్రెస్ అధ్యక్షుడు పున్న గణేష్‌నేత, ఎస్సీసెల్ కన్వీనర్ బండి మధుసూదన్‌రావు, మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు లక్ష్మి, రేణుక, తలాటి రమేష్‌నేత, డకియార్ నాయక్, పగడాల ఎల్లన్న, యాదవరెడ్డి, జ్ఞానేశ్వర్‌యాదవ్, దుబ్బాక శేఖర్, సైదులు, శేఖర్, మహేందర్, అక్బర్, లింగస్వామి, భూపాల్‌రెడ్డి పాల్గొన్నారు.



సరూర్‌నగర్‌లో సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేస్తున్న మాజీ కౌన్సిలర్ దర్పల్లి అశోక్, సుశీలరెడ్డి బీఆర్‌ఎస్ నాయకులు

సరూర్‌నగర్‌లో..

సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కలపై సబితారెడ్డి చేసిన వ్యాఖ్యలను తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ సరూర్‌నగర్ మండల కార్యాలయం ఎదురుగా మహిళా కాంగ్రెస్ ఆధ్వర్యంలో సబితారెడ్డి దిష్టిబొమ్మ దహనం చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకుడు బేర బాలకిషన్, సరూర్‌నగర్ అధ్యక్షుడు బోయిని శంకర్‌యాదవ్, యువజన కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు నల్లెంకి ధన్‌రాజ్‌గౌడ్, మహిళా కాం గ్రెస్ అధ్యక్షురాలు అరుణ, ప్రధాన కార్యదర్శులు సంగీత, సుశీల, శ్రావణి, రోజ, ఎన్‌ఎస్‌యూఐ ఉపాధ్యక్షుడు రంజిత్, డీసీసీ ఉపాధ్యక్షుడు కిషోర్ పాల్గొన్నారు.

సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం

శాసనసభలో ఎమ్మెల్యే సబితారెడ్డిపై సీఎం రేవంత్‌రెడ్డి అనుచిత వ్యాఖ్యలు చేయడం పట్ల నిరసన వ్యక్తం చేస్తూ బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు సరూర్‌నగర్‌లో సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. ఇకనైనా మహిళలను గౌరవించడం కాంగ్రెస్ నేతలు నేర్చుకోవాలని బీఆర్‌ఎస్ నాయకులు హితవుపలికారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ దర్పల్లి అశోక్, బీఆర్‌ఎస్ మహిళా నాయకురాలు సుశీలరెడ్డి, సరూర్‌నగర్ డివిజన్ మాజీ అధ్యక్షుడు పందుల రాజు, అభిలాష్‌గౌడ్, జహీర్, ఇస్మాయిల్, బాలరాజు, సుధ, సాలమ్మ, యాదగిరి, అభిలాష్, రమేష్, యాలాద్రి, మురళీ పాల్గొన్నారు.

6న గద్దర్ ప్రథమ వర్ధంతి సభ

పంజాగుట్ట, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): ప్రజా యుద్ధనౌక గద్దర్ ఒక వ్యక్తి కాదు శక్తి అని, ఆయన వారసత్వాన్ని కొనసాగిస్తామని పలువురు వక్తలు అన్నారు.

గద్దర్‌ను మర్చిపోవడం సాధ్యం కాదని, ఆయన పాట జనంలో సజీవంగా ఉంటుందని వారు పేర్కొన్నారు. గద్దర్ ఫౌండేషన్ చైర్మన్ గుమ్మడి సూర్యకిరణ్ అధ్యక్షతన గురువారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో గద్దర్ ప్రథమ వర్ధంతి సభ పోస్టర్‌ను తెలంగాణ మీడియా అకాడమీ మాజీ చైర్మన్ అల్లం నారాయణ, మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్, ఎంపీ ఫౌండేషన్ ప్రతినిధి వెంకట్‌రెడ్డి, వేములపాటి అజయ్, సీఎల్ యాదగిరి, ఏపూరి సోమన్న, ప్రొఫెసర్ ప్రభంజన్ యాదవ్, తదితరులు ఆవిష్కరించారు. ఈ నెల 6న గద్దరన్న యాదిలో రవీంద్రభారతిలో నిర్వహించనున్న కార్యక్రమానికి దేశవ్యాప్తంగా అభిమానులు హాజరుకానున్నట్లు వారు తెలిపారు. ఈ సందర్భంగా గద్దర్ రాసిన రెండు పుస్తకాలను కూడా ఆవిష్కరించనున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో ఓయూ ప్రొఫెసర్ పరశురాం, యశ్పాల్, రచయిత జలజ పాల్గొన్నారు.



శాంతియుత నిరసన కార్యక్రమంలో తెలంగాణ లెక్చరర్స్ ఫోరం వ్యవస్థాపక అధ్యక్షుడు కత్తి వెంకటస్వామి తదితరులు

మోడల్ స్కూల్ టీచర్ల బదిలీలను చేపట్టాలి

కవాడిగూడ, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): మోడల్ స్కూల్ ఉపాధ్యాయుల బదిలీలు చేపట్టి వారికి న్యాయం చేయాలని మోడల్ స్కూల్ టీచర్స్ జేఏసీ నేతలు కాంగ్రెస్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. పదకొండు సంవత్సరాలుగా బదిలీలు లేవని, చాలా మంది ఉపాధ్యాయులు అనారోగ్యంతో చనిపోయారని పేర్కొన్నారు. గురువారం ఇందిరాపార్కు ధర్నా చౌక్‌లో తెలంగాణ మోడల్ స్కూల్ టీచర్స్ జేఏసీ ఆధ్వర్యంలో శాంతియుత నిరసన, ఆవేదన కార్యక్రమం నిర్వహించారు.

రాష్ట్రవ్యాప్తంగా ఉన్న మోడల్ స్కూల్ ఉపాధ్యాయులు హాజరయ్యారు. ఈ సందర్భంగా తెలంగాణ లెక్చరర్స్ ఫోరం వ్యవస్థాపక అధ్యక్షుడు ప్రొఫెసర్ కత్తి వెంకటస్వామి మాట్లాడుతూ.. సమస్యను సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు తనవంతు కృషి చేస్తానన్నారు. జేఏసీ నేతలు అరవింద్‌గోష్, గోపీనాథ్, కె.సాయిచరణ్, రాజశ్రీ, ఎండీ ఇర్షద్ అలీ, సాజిద్, శివప్రసాద్, రవీందర్, ఏవీ ప్రసాద్, ఆంజనేయులు, రజని, లత మాట్లాడారు. 11 సంవత్సరాలుగా బదిలీలు లేక కుటుంబసభ్యులకు దూరంగా ఒకే పాఠశాలలో పనిచేసే వారిని బదిలీ చేయాలని డిమాండ్ చేశారు.

చిరువ్యాపారాల పేరుతో నిర్మించిన షెడ్ల కూల్చివేత

చాదర్‌ఘాట్: ఉపాధి కోసం చిరు వ్యాపార కేంద్రాలను ఏర్పాటు చేసుకోవడానికి జీహెచ్ఎంసీ అనుమతిస్తే కొందరు షెడ్లు నిర్మించడంతో కూల్చివేశారు. మలక్‌పేట సర్కిల్-6 శానిటేషన్ సూపర్‌వైజర్ గోవింద్‌రెడ్డితో కూడిన బృందం గ్రేటర్ కమిషనర్ ఆదేశాల మేరకు గురువారం కూల్చివేతలకు చర్యలు చేపట్టింది. చిరువ్యాపారులు తాత్కాలిక డబ్బాలు, తోపుడు బండ్లతో వ్యాపారాలు చేసుకోవడానికి జీహెచ్ఎంసీ అనుమతిస్తే కొంత మంది వ్యాపారులు వాటి స్థానంలో షెడ్లను, పర్మినెంట్ డబ్బాలను ఏర్పాటు చేసుకుని ఇతరుల కు అద్దెకిచ్చి డబ్బులు దండుకుంటున్నట్లుగా వచ్చిన ఫిర్యాదుల మేరకు కూల్చివేతకు చర్యలు చేపట్టినట్లు సూపర్‌వైజర్ గోవింద్‌రెడ్డి తెలిపారు. పదికి పైగా షెడ్లను కూల్చివేసి, ఉపయోగంలో లేని 20పైగా డబ్బాలను తొలగించారు.



సర్వీస్‌రోడ్డులో నిర్మించిన షెడ్లను కూల్చివేస్తున్న జీహెచ్ఎంసీ శానిటేషన్ సిబ్బంది

పెట్టుబడి పేరుతో మోసం.. ముఠాలోని మరో ఇద్దరు నిందితుల అరెస్ట్

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): ఆన్‌లైన్ ట్రేడింగ్ పేరుతో రూ.6.05కోట్ల మోసానికి పాల్పడ్డ ఓ ముఠాలోని ఇద్దరు సైబర్ నేరగాళ్లను ఇదివరకే అరెస్ట్ చేయగా పరారీలో ఉన్న మరో ఇద్దరిని రాచకొండ సైబర్ క్రైం పోలీసులు గురువారం అరెస్ట్ చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మాధవరం వంశీ కృష్ణారావు (35), తాటిపల్లి రాకేష్ (28), ధవళేశ్వరపు నవీన్‌కుమార్ (37), జెట్టి ఫణికుమార్ (34)లు ఆన్‌లైన్‌లో పెట్టుబడి పెడితే అధిక లాభాలు వస్తాయని ప్రచారం చేసుకున్నారు. ఆసక్తి చూపిన వారిని ఆర్7322 టీమ్ హార్వే పేరుతో టెలీగ్రాం గ్రూపులో యాడ్ చేశారు. పెట్టుబడి పెట్టిన వారికి ముందుగా కొంత మొత్తం లాభం వచ్చినట్లు చూపేవారు. డబ్బు తన ఖాతాల్లో వేయించుకొని, యాప్‌లో డబ్బు పెట్టుబడి పెట్టినట్లు చూపేవారు. ఇలా పలువురిని మోసం చేసి రూ.6.05 కోట్లు వసూలు చేశారు. లాభాలు వచ్చినట్లు యాప్‌లో చూపినా, డబ్బు విత్‌డ్రా చేసుకునే అవకాశం లేకపోవడం.. మోసగాళ్లు స్పందించకపోవడంతో బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న రాచకొండ సైబర్ క్రైం పోలీసులు జూలై 24న మాధవరం వంశీకృష్ణారావు, తాటిపల్లి రాకేష్‌లను అరెస్ట్ చేశారు. పరారీలో ఉన్న ధవళేశ్వరపు నవీన్ కుమార్, జెట్టి ఫణికుమార్‌లను గురువారం అరెస్ట్ చేశామని సైబర్ క్రైం డీసీపీ అరవింద్ బాబు తెలిపారు.

ఎల్బీనగర్‌లో హెరాయిన్ పెడ్లర్ అరెస్ట్

- 30 గ్రాముల హెరాయిన్, సెల్‌ఫోన్ స్వాధీనం

కొత్తపేట: ఎల్బీనగర్‌లో పాత హెరాయిన్ పెడ్లర్‌ను ఎస్‌ఓటీ, లా అండ్ ఆర్డర్ ఎల్బీనగర్ పోలీసులు అరెస్టు చేశారు. అతడి వద్ద హెరాయిన్, సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకుని రిమాండుకు తరలించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రాజస్థాన్ బర్మార్ జిల్లా సిధసావ హర్నియాన్ గ్రామానికి చెందిన విక్రమ్‌కుమార్ అలియాస్ విక్రమ్ గోయల్(28) 2021లో డిగ్రీ పూర్తి చేశాడు. తర్వాత సికింద్రాబాద్‌కు మకాం మార్చి మోండా మార్కెట్‌లోని భవానీ రెస్ట్ రూమ్స్‌లో ఉంటూ రాపిడో బాయ్‌గా పనిచేస్తూ జీవనం కొనసాగిస్తున్నాడు. జల్సాలకు అలవాటుపడి తక్కువ సమయంలో ఎక్కువ డబ్బు సంపాదించాలని డ్రగ్ పెడ్లర్‌గా మారాడు. బర్మార్ జిల్లా బాండ్ గ్రామం దోరిమానకు చెందిన దినేష్‌కుమార్ వద్ద అతడు డ్రగ్స్ కొనుగోలు చేసేవాడు. డ్రగ్స్‌ను అతడు రైల్లో నగరానికి తీసుకువచ్చేవాడు. రాపిడో బాయ్‌గా పనిచేస్తుండడంతో ఎవరికీ అనుమానం రాకుండా బైక్‌పై తిరుగుతూ డ్రగ్స్ వినియోగించే వారికి హెరాయిన్‌ను ఎక్కువ ధరకు విక్రయించేవాడు. గత నెల ఎస్‌ఓటీ పోలీసులు సరూర్‌నగర్ పీఎస్ పరిధిలో నమోదైన డ్రగ్స్ - ఎన్‌డీపీఎస్ కేసులో ఇద్దరు నిందితులను అరెస్టు చేసి 40 గ్రాముల హెరాయిన్ స్వాధీనం చేసుకున్నారు. అదే కేసులో మరో నిందితుడైన విక్రమ్‌కుమార్ పరారీలో ఉన్నాడని గుర్తించిన పోలీసులు నిఘా పెట్టి ఎల్బీనగర్ పీఎస్ పరిధిలో అతడిని అదుపులోకి తీసుకుని విచారించారు. అతడి వద్ద రూ. 4లక్షలు విలువ చేసే 30 గ్రాముల హెరాయిన్, సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకుని రిమాండుకు తరలించారు.

మహిళ అనుమానాస్పద మృతి కేసులో ఆరుగురికి రిమాండ్

హయత్‌నగర్ : బంజారాకాలనీలో గృహిణి సుజాత అనుమానాస్పద మృతి కేసులో భర్త రమావత్ శివతో పాటు మరో ఐదుగురి కుటుంబ సభ్యులను హయత్‌నగర్ పోలీసులు అరెస్టు చేసి గురువారం రిమాండుకు తరలించారు. బుధవారం సుజాత బంధువులు హయత్‌నగర్ పోలీస్‌స్టేషన్ ఎదుట ఆందోళన చేసి నానా అంగామా సృష్టించడంతో తీవ్ర ట్రాఫిక్ జాంతో పా టు తోపులాటలో పలువురు మహిళా పోలీసులకు గాయాలు అయ్యాయి. దీంతో పోలీసులు సంఘటన దృశ్యాలను సెల్‌ఫోన్ వీడియోల ద్వారా పరిశీలించి అందు కు కారణం అయిన సుజాత బంధువులైన ఎనిమిది మంది పైన కూడా కేసులు నమోదు చేసినట్లు తెలుస్తుంది. మరికొంత మందిని గుర్తించాల్సి ఉందని పోలీసులు తెలిపారు.

విడాకులు తీసుకున్న భార్యను హత్యచేసేందుకు యత్నం

- కత్తితో దాడి.. తీవ్రంగా గాయపడిన భార్య


సైదాబాద్: విడాకులు తీసుకున్న భార్యపై కత్తితో దాడి చేసి హత్య చేసేందుకు యత్నించిన భర్తపై మాదన్నపేట పోలీసులు కేసు నమోదు చేశారు. మాదన్నపేట చావునీకి చెందిన అస్రా ఫాతిమా(30) కిషన్‌బాగ్‌కు చెందిన ఆటోడ్రైవర్ అబ్దుల్ అజీజ్‌తో(36)తో పెళ్లి జరిగింది. మనస్పర్ధలతో 70 రోజుల క్రితం ఇద్దరు పరస్పర అంగీకారంతో విడాకులు తీసుకున్నారు. అనంతరం ఫాతిమా చావునీలోని సోదరి ఇంట్లో ఉంటున్నది. విషయం తెలుసుకున్న అజీజ్ మంగళవారం రాత్రి ఫాతిమా వద్దకు మాట్లాడేందుకు వచ్చాడు. ముందుగా పథకం ప్రకారం ఫాతిమాను చంపాలనే ఉద్దేశంతో వెంట కత్తి తెచ్చుకున్నాడు. ఫాతిమాతో మాట్లాడుతూనే ఒకసారిగా ఆగ్రహంతో పరుషపదజాలంతో కత్తితో విచక్షణ రహితంగా దాడి చేయసాగాడు. ఆమె కేకలు వేయడంతో కుటుంబసభ్యులు, పొరుగువారు అక్కడికి చేరుకోవడంతో అతడు పారిపోయాడు. తీవ్రంగా గాయపడిన ఫాతిమాను పోలీసులు చికిత్స కోసం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు మాదన్నపేట ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ తెలిపారు.

పోలీసులను దూషించిన యువకుడిపై కేసు నమోదు

చంపాపేట: విధుల్లో ఉన్న పోలీసులను బెదిరించి, దూషించిన వ్యక్తిపై కంచన్‌బాగ్ పోలీసులు కేసు నమోదు చేశారు. డీఎంఆర్‌ఎల్ చౌరస్తా సమీపంలోని భంధన ప్రసన్నాంజనేయస్వామి ఆలయం ఎదుట ప్రధాన రహదారిపై సంతోష్‌నగర్ ట్రాఫిక్ ఎస్‌ఐ, పోలీసులు బుధవారం ఉదయం వాహనాల తనిఖీ చేపట్టారు. మందమల్లమ్మ చౌరస్తా నుంచి డీఎంఆర్‌ఎల్ చౌరస్తా వైపు ఆక్టివా బైక్‌పై నాగోల్ ఆదర్శనగర్‌కు చెందిన వ్యాపారి యష్‌కుమార్(23) అనే యువకుడు హెల్మెట్ లేకుండా వస్తుండగా పోలీసులు ఆపి డ్రైవింగ్ లైసెన్స్ చూపించమని కోరారు. దీంతో అతను పోలీసులను దూషించి, బెదిరింపులకు పాల్పడ్డాడు. పోలీసుల విధులకు ఆటంకం కల్పించాడు. ట్రాఫిక్ ఎస్‌ఐ వీ.సత్యనారాయణ ఫిర్యాదు మేరకు కంచన్‌బాగ్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు. గురువారం యష్‌కుమార్‌ను నాంపల్లి కోర్టులో హాజరు పరచగా న్యాయమూర్తి అతనికి రెండు రోజుల జైలుశిక్ష విధించినట్లు ఇన్‌స్పెక్టర్ శేఖర్‌రెడ్డి తెలిపారు.

ఏఐ సామర్థ్యాలతో కొత్త ఆవిష్కరణలు

ఏఐజీ, ఐఎస్‌బీతో ఒప్పందం



ఒప్పంద పత్రాలను అందజేస్తున్న నాగేశ్వర్‌రెడ్డి

హైదరాబాద్ సిటీ: భారతదేశంలోని వైద్యుల క్లినికల్ అనుభవాలకు ఏఐ సామర్థ్యాలను జోడించడం ద్వారా ఆరోగ్య సంరక్షణను పునర్వ్యవస్థీకరించే ఒక ప్రణాళిక కోసం ఏఐజీ ఆస్పత్రితో ఇండియన్ బిజినెస్ స్కూల్(ఐఎస్‌బీ) పరస్పర ఒప్పందం చేసుకుంది. ఈ మేరకు గురువారం ఏఐజీ ఆస్పత్రిలో ఒప్పందంపై సంతకాలు చేసి పత్రాలను మార్చుకున్నారు. ఆరోగ్య సంరక్షణలో ఆర్టిఫీషియల్ ఇంటిలిజెన్స్(ఏఐ) పేరుతో రూపొందించే ఈ కార్యక్రమం కొత్త ఆవిష్కరణలు, పద్ధతులు, రోగులకు మెరుగైన వైద్య చికిత్సలు అందించడం లక్ష్యంగా పెట్టుకున్నారు. ఐఎస్‌బీలోని పరిశోధన సంస్థ అయిన మాక్స్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ హెల్త్‌కేర్ మేనేజ్‌మెంట్(ఎంఐహెచ్‌ఎం)ఈ కార్యక్రమంలో ప్రధాన భాగస్వామిగా ఉంటుంది. ఎగ్జిక్యూటివ్ ఎడ్యుకేషన్, డిజిటల్ లెర్నింగ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సుజాత కుమారస్వామి పాల్గొన్నారు.

హత్తిగూడ చెరువుపై హైడ్రా కమిషనర్‌కు నివేదిక

- ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ ఆక్రమణలను పరిశీలించిన హైడ్రా, రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు

హయత్‌నగర్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): కుంట్లూరు, హయత్‌నగర్ శివారులో ఉన్న హత్తిగూడ చెరువును గురువారం హైడ్రా, అబ్దుల్లాపూర్‌మెట్ మండల ఇరిగేషన్, సర్వేయర్, హయత్‌నగర్ మండల రెవెన్యూ అధికారుల బృందం పరిశీలించారు. ఉదయం 10గంటలకే మన్సూరాబాద్ డివిజన్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి, ఇబ్రహీంపట్నం ఇరిగేషన్ డీఈఈ ఉషారాణి, అబ్దుల్లాపూర్‌మెట్ ఇరిగేషన్ ఏఈ తస్వీర్ రజా, మండల సర్వేయర్ జ్యోతి, హయత్‌నగర్, అబ్దుల్లాపూర్‌మెట్ మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు నర్సింహయాదవ్, భిక్షపతిలు హత్తిగూడ చెరువుకు చేరుకున్నారు. నార్త్ ట్యాంకు డివిజన్ ఏఈ నాగరాజు కోసం ఎదురు చూశారు. 11గంటలకు జీహెచ్ఎంసీ(హైడ్రా) ఏఈ మల్లికార్జున్, విజిలెన్స్ ఎస్ఐ మోహన్‌లు అక్కడికి చేరుకున్నారు. నాగరాజు రాకపోవడంతో అధికారుల బృందం చెరువు బఫర్, ఎఫ్‌టీఎల్ ప్రాంతాలను పరిశీలించారు. నాలా కబ్జా, బఫర్‌లో వెలసిన ప్లాట్లను, నిర్మాణాలను చూశారు. అన్నింటి ఫొటోలను తీసుకున్నారు. మూడు రోజుల క్రితం మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి హత్తిగూడ చెరువును కబ్జా నుంచి కాపాడాలని కోరుతూ జీహెచ్ఎంసీ హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్‌ను కలిసి ఫిర్యాదు చేసిన సంగతి తెలిసిందే. ఎన్ని ఫిర్యాదులు చేసినా స్థానిక అధికారులు పట్టించుకోవడం లేదని కార్పొరేటర్ కమిషనర్ దృష్టికి తీసుకుపోయారు. చెరువు కబ్జా వల్ల పైన ఉన్న కాలనీలు నీట మునుగుతున్నాయని ఫిర్యాదు చేశారు. అందుకు స్పందించిన కమిషనర్ గురువారం అధికారుల బృందాన్ని చెరువు పరిశీలనకు పంపారు. గతంలో నార్త్ ట్యాంకు డివిజన్ అధికారులు, అబ్దుల్లాపూర్‌మెట్ ఇరిగేషన్ అధికారులు చేసిన సర్వే కాపీలను కార్పొరేటర్ హైడ్రా అధికారులకు అందించారు. చెరువును పూడుస్తున్నారని లేక్ ఏఈ నాగరాజు, అప్పటి హయత్‌నగర్ తహసీల్దార్ సంధ్యారాణికి ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని తెలిపారు. స్థానిక బిల్డర్లు బఫర్ జోన్‌లో ప్లాట్లు కొనుగోలు చేసి దొడ్డిదారిలో అనుమతులు తీసుకువస్తున్నారని తెలిపారు. ఇరిగేషన్ అనుమతులు కూడా వస్తున్నాయని తెలిపారు. రెండు శాఖల అధికారులు సర్వే చేసి హద్దులు ఏర్పాటు చేయాలని కోరారు.



చెరువు బఫర్ జోన్, ఎఫ్‌టీఎల్ ప్రాంతాలను చూపిస్తున్న ఇరిగేషన్ ఏఈ తస్వీర్ రజా



గతంలో హత్తిగూడ చెరువుపై చేసిన సర్వే రిపోర్టులను హైడ్రా అధికారులకు చూపిస్తున్న కార్పొరేటర్ నర్సింహారెడ్డి

కమిషనర్‌కు నివేదిక సమర్పిస్తాం.. ఏఈ మల్లికార్జున్

హత్తిగూడ చెరువులో పరిశీలించిన వాస్తవాలను హైడ్రా కమిషనర్‌కు వివరించి నివేదిక సమర్పిస్తామని హైడ్రా ఏఈ మల్లికార్జున్ తెలిపారు. గతంలో రెండు శాఖల అధికారులు చేసిన సర్వే రిపోర్టులను కూడా అందజేస్తాం. జీహెచ్ఎంసీ లేక్ ఏఈ నాగరాజు ఫోన్ చేసినా తీయడని కార్పొరేటర్ చెప్పడంతో తమ డిపార్టుమెంటు అధికారులు ఫోన్ చేసినా తీయడం లేదని ఏఈ మల్లికార్జున్ తెలిపారు. తప్పుడు సర్వే ఉన్నట్లయితే చర్యలు తప్పవని అన్నారు.

సపరేటుగా వచ్చిన జీహెచ్ఎంసీ ఏఈ నాగరాజు

అధికారుల బృందం వెళ్లిపోయిన తర్వాత మధ్యాహ్నం 1.40 కు జీహెచ్ఎంసీ లేక్ ఏఈ నాగరాజు వచ్చారు. పై కాలనీల నుంచి హత్తిగూడ చెరువుకు వచ్చే నీటి కాలువను పరిశీలించారు. కల్వర్టు నుంచి చెరువు వరకు 6ఫీట్ల వెడల్పుతో కాలువ తీస్తామని చెప్పారు.